క్లుప్తంగా

విద్యార్థులకు బ్లడ్‌గ్రూపులపై అవగాహన



విద్యార్థులకు రక్త పరీక్షలు నిర్వహిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్ రమేష్

తగరపువలస: జీవీఎంసీ ఒకటోవార్డు రామన్నపేట సాయిరవీంద్ర పాఠశాల విద్యార్థులకు బుధవారం రక్త గ్రూపులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు ల్యాబ్ టెక్నీషియన్ రమేష్‌తో పరీక్షలు చేయించారు. విద్యార్థుల బ్లడ్ గ్రూప్‌లు తెలియజేసి, వాటి గురించి వివరించారు. కార్యక్రమంలో స్కూల్ కరస్పాండెంట్ బోగెల కృష్ణ, ప్రిన్సిపాల్ వాండ్రాసి సతీష్, ఉపాధ్యాయినులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు శిరీష



పతకాలతో శిరీష

పద్మనాభం: యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇటీవల ఎంవీపీ కాలనీలో జరిగిన జిల్లా స్థాయి ట్రెడిషనల్ యోగాసన ఆర్టిస్టిక్ డ్యాన్స్ పోటీల్లో మహిళా విభాగంలో కృష్ణాపురానికి చెందిన చలపాక శిరీష ప్రథమ స్థానంలో నిలిచి, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైంది. ఆమె ఆంధ్రా యూనివర్సిటీలో యోగా ఎంఏ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈ నెల 21 నుంచి తూర్పుగోదావరి జిల్లా పత్తిపాడులో జరగనున్న రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొననున్నారు.

అమలు కాని హామీలతో 'కూటమి' మోసం

- ప్రజలకు అండగా వారి పక్షాన పోరాడాలి
- వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త చిన్నశ్రీను
- 1,2,3,4 వార్డుల నాయకులు, కార్యకర్తలకు దిశానిర్దేశం



పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు



కార్యక్రమంలో మాట్లాడుతున్న మజ్జి శ్రీనివాసరావు

భీమునిపట్నం: ఏమాత్రం అమలు చేయలేని హామీలను ఇచ్చి కూటమి ప్రభుత్వం ప్రజలందరినీ మోసం చేసిందని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ఈ తరుణంలో ప్రజల పక్షాన నిలబడి పోరాడాలని పిలుపునిచ్చారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా భీమిలిలోని 1,2,3,4 వార్డులకు చెందిన నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆయన సమావేశమై, దిశానిర్దేశం చేశారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 14నెలలైనా హామీలు నెరవేర్చడంతో పూర్తిగా విఫలమైందన్నారు. పింఛన్లు కూడా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు. ఏవో కారణాలు చెప్పి చాలావరకు పింఛన్లను తొలగిస్తున్నారని, కొత్త పింఛన్లు ఇవ్వడం లేదని పేర్కొన్నారు.

అన్ని వర్గాలవారు మోసపోయారు

చంద్రబాబు ఎప్పటిలానే మాట నిలబెట్టుకోకుండా మోసం చేశారని చిన్నశ్రీను అన్నారు. మహిళలను, విద్యార్థులను, రైతులను అందరినీ నిలువునా నమ్మించి ముంచేశారన్నారు. తమకు జరిగిన మోసాన్ని ప్రజలందరు గ్రహించారని, ప్రభుత్వంపై పూర్తి వ్యతిరేకతతో ఉన్నారని అన్నారు. తాను గ్రామాలకు వెళ్తున్న సందర్భాల్లో ప్రజలు పెద్ద ఎత్తున తమ అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు.

ప్రభుత్వ భూముల ధారాదత్తం

ఎంతో విలువైన ప్రభుత్వ భూములను కార్పొరేట్ కంపెనీలకు ఈ ప్రభుత్వం ధారాదత్తం చేస్తోందని, ఇది చాలా దారుణమని అన్నారు. వారికి మేలు చేకూర్చేందుకు అతి తక్కువ ధరలతో ఇస్తున్నారని, దీని వల్ల ప్రజలకు నష్టం జరుగుతుందన్నారు.

ప్రజల పక్షాన నిలబడాలి

మన పార్టీపరంగా ఇప్పుడు ప్రజలకు అండగా, వారి పక్షాన నిలబడవలసిన బాధ్యత అందరిపై ఉందన్నారు. అధికారంలో ఉన్న సమయంలో వారికి మేలు జరిగేలా ప్రభుత్వం చూసుకుందని, ఇప్పుడు ప్రతిపక్షంలో ఉన్నా వారికి మంచి జరిగేవిధంగా అండగా ఉండాలని సూచించారు. ఇప్పుడు జరుగుతున్న మోసాల గురించి ఇంటింటా విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని, ఇది ఎంతో అవసరమన్నారు.

అందరికీ అండగా ఉంటా

పార్టీలోని ప్రతి ఒక్కరికీ అండగా ఉంటానని శ్రీనివాసరావు అన్నారు. ఎవరికి ఎటువంటి ఇబ్బందులు, సమస్యలు వచ్చినా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానన్నారు. ఐక్యతతో అందరం ఒకే మాటపై ఉందామన్నారు. కార్యక్రమంలో నాలుగో వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, వార్డుల అధ్యక్షులు అల్లిపిల్లి నర్సింగరావు, చిల్ల భాస్కరరెడ్డి, జగ్గుపల్లి ప్రసాద్, పాలరమణారెడ్డి, ఇన్‌చార్జిలు ఎస్.కరుణాకరరెడ్డి, మైలిపల్లి షణ్ముఖరావు, జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి, బీసీ సెల్ కార్యదర్శి అక్కరమాని మంగరాజు, జిల్లా అధికార ప్రతినిధి బింగి హరికిరణ్‌రెడ్డి, మహిళ విభాగ కార్యదర్శి డబ్బీరు ప్రశాంతి పట్నాయక్, ముఖ్య నాయకులు అక్కరమాని రామునాయుడు, వాసుపల్లి కొండబాబు, చిప్పాడ వెంకటేష్, వాసుపల్లి జానకిరాం, గుండాసి మధునాయుడు, పిన్నింటి ఎర్రయ్యరెడ్డి, కోండ్రు రామసూరప్పడు, మైలిపల్లి లక్ష్మణరావు, ముక్కి కృష్ణ, రాంభుక్త ప్రభాకర్‌నాయుడు, శిల్ల వంశీరెడ్డి, దూడ అచ్చారావు, వాసుపల్లి నల్లబాబు, మేరుగు చిన్నారావు, చెల్లూరి గౌరినాయుడు, ఎరుసు అప్పలకొండ, బోని శ్రీను, అనపర్తి సూర్యప్రకాశ్, బోని సంజీవరావు, షేక్ బషీర్ తదితరులు పాల్గొన్నారు.

ల్యాండ్‌పూలింగ్ రైతులకు ఎల్పీవోసీల పంపిణీ



రైతులకు ఎల్పీవోసీలు అందిస్తున్న ఎమ్మెల్యే గంటా, చిత్రంలో కలెక్టర్ హరేందిర ప్రసాద్

తగరపువలస: ఆనందపురం మండలంలో ఎంఐజీ హౌసింగ్ కోసం ల్యాండ్ పూలింగ్ ద్వారా 230 ఎకరాల భూమి ఇచ్చిన రామవరం, గంగసాని అగ్రహారం రైతులకు కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు బుధవారం ఎల్పీవోసీలు అందించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఆక్రమణలో ఉన్నవారికి కూడా పరిహారం ఇచ్చేలా ప్రభుత్వానికి లేఖ రాశామన్నారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ ల్యాండ్ పూలింగ్‌కు భూములు ఇచ్చిన రైతులకు యాజమాన్య హక్కు పట్టాలు అందించినట్టు తెలిపారు. మండలంలో ప్రభుత్వ ఇళ్లపట్టాల అవసరాల కోసం 2వేల నుంచి 3వేల ఎకరాలు సేకరించవలసి ఉందన్నారు. వీఎంఆర్డీఏ లే అవుట్‌ల వలన చుట్టుపక్కల గ్రామాల భూముల ధరలు పెరుగుతాయన్నారు. తర్లువాడలో 200 ఎకరాలలో గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటు కానుందన్నారు. నియోజకవర్గంలో 7 ఇనాం గ్రామాలలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం చూపించవలసి ఉందన్నారు. కార్యక్రమంలో వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్, జేసీ మయూర్ అశోక్, భీమిలి ఆర్డీవో కె.సంగీత్ మాథూర్ తదితరులు పాల్గొన్నారు.

తీరప్రాంత భద్రతపై మాక్‌డ్రిల్

కొమ్మాది: తీర ప్రాంత భద్రతతో పాటు తీవ్రవాదులు చొరబడినప్పుడు అత్యవసర పరిస్థితిలో చేపట్టాల్సిన రక్షణ చర్యలపై ఆక్టోపస్ చార్లి టీమ్ ఆధ్వర్యంలో గీతంలో బుధవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. గీతంలో పలు భవంతులలో తీవ్రవాదులను గుర్తించి, విశ్వవిద్యాలయ సిబ్బందిని రక్షించే విధంగా ఆపరేషన్ నిర్వహించారు. చార్లి టీమ్ ఉన్నతాధికారులు, డీసీపీలు తిరుపతయ్య, డి.రాంబాబు నేతృత్వంలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించారు.

తెలుగు భాషను నిర్లక్ష్యం చేయొద్దు



మాట్లాడుతున్న ఐఆర్‌ఎస్ అధికారి రవి కిరణ్

పద్మనాభం: తెలుగు భాషను నిర్లక్ష్యం చేయవద్దని ఐఆర్‌ఎస్ అధికారి ఈదర రవికిరణ్ అన్నారు. జీవన నైపుణ్యాలు అంశంపై ఆర్‌వీపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో బుధవారం నిర్వహించిన ముఖాముఖిలో రవికిరణ్ మాట్లాడారు. ఇంగ్లిష్‌లో పట్టు సాధించాలంటే అమ్మభాష రావాలన్నారు. జీవితంలో అన్ని పరిస్థితులను ఎదుర్కొనేలా పిల్లలు నేర్చుకునే విద్య దోహదపడాలన్నారు. భావ ప్రకటన సామర్థ్యం, భావోద్వేగాల నియంత్రణ వంటి జీవన నైపుణ్యాలు భవిష్యత్‌లో ఉద్యోగాలు రావడానికి కీలకమన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం విజినిగిరి శంకరరావు, ఎం.కృష్ణారావు, పి.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

వాణి రో వారసత్వాన్ని కొనసాగించాలి

- ఐఐఎంవీ గవర్నర్ల బోర్డు సభ్యురాలు ఉమాసుధీంద్ర



వాణి రో తండ్రి బి.ఆర్.ఎల్.రో కు కుమార్తె జ్ఞాపికను అందిస్తున్న డైరెక్టర్ చంద్రశేఖర్

తగరపువలస: ఐఐఎం అహ్మదాబాద్ పూర్వ విద్యార్థిని, నగరానికి చెందిన వాణి రో ప్రముఖ కన్సల్టెంట్‌గా, ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకర్‌గా ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందారని ఐఐఎంవీ గవర్నర్ల బోర్డు సభ్యురాలు ఉమా సుధీంద్ర అన్నారు. ఐఐఐఎంవీ విద్యార్థినులు ఆ వారసత్వాన్ని కొనసాగించాలని ఆకాంక్షించారు. వాణి రో జయంతి సందర్భంగా ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీలో బుధవారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో ఆమె ప్రసంగించారు. ఏటా ఆగస్టు 6న ఆమె జయంతి సందర్భంగా భవిష్యత్తు నాయకులకు స్ఫూర్తిగా వాణి రో గురించి చర్చించడం శుభపరిణామమన్నారు. ఐఐఎంవీ అడ్మినిస్ట్రేషన్ డీన్ కావేరీ కృష్ణన్, డైరెక్టర్ ఎం.చంద్రశేఖర్ మాట్లాడుతూ ఏడాది క్రితం ఇదే రోజున వాణి రో మెమోరియల్ ఇంక్యుబేషన్ సెంటర్ స్థాపించినట్టు తెలిపారు. వాణి రో తండ్రి బి.ఆర్.ఎల్.రో ఔదార్యంతో ఇది సాధ్యమైందని, ప్రస్తుతం ఈ కేంద్రం 180కి పైగా స్టార్టప్‌లకు మద్దతు ఇస్తోందని తెలిపారు. బి.ఆర్.ఎల్. రో మాట్లాడుతూ తన కుమార్తె వాణి రో ఐఐఎంలో చేరాలనుకున్నప్పుడు వ్యాపార విద్యలో మహిళలకు అవకాశాలు, ప్రోత్సాహం తక్కువగా ఉండేవని గుర్తు చేసుకున్నారు. అయినప్పటికీ ఆమె ధైర్యం, స్పష్టతతో ముందుకు సాగిందన్నారు. ఆమె ద్వారా ప్రేరణ పొందిన పలువురిని చూస్తుండటం గర్వంగా ఉందన్నారు. కార్యక్రమంలో డీన్, అకడమిక్ ప్రొఫెసర్ సూరిశెట్టి విజయభాస్కర్ తదితరులు వాణి రో గురించి మాట్లాడారు.

రామునాయుడుకు నివాళి



రామునాయుడు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ భీమిలి సమన్వయకర్త చిన్న శ్రీను



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ విశాఖ, అనకాపల్లి జిల్లా అధ్యక్షులు కేకే రాజు, అమర్‌నాథ్

పద్మనాభం: ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి, మృతి చెందిన కోరాడ గ్రామానికి చెందిన చింతలవలస ఏపీఎస్పీ బెటాలియన్ హెడ్ కానిస్టేబుల్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు సోదరుడు కోరాడ రామునాయుడుకు బుధవారం పలువురు నివాళులర్పించారు. కోరాడలో జరిగిన సంస్మరణ కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొని ఆయన సేవలను స్మరించుకున్నారు. వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా అధ్యక్షుడు కేకే రాజు, అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్, భీమునిపట్నం నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు, మాజీ ఎమ్మెల్యే తైనాల విజయ్‌కుమార్, వైఎస్సార్ సీపీ నాయకులు బొత్స లక్ష్మణరావు, జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, పద్మనాభం ఎంపీపీ కంటుబోతు రాంబాబు, ఆనందపురం జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు నివాళులర్పించిన వారిలో ఉన్నారు.

ఉత్సాహంగా గాత్ర సంగీత పోటీలు



గాత్ర పోటీల్లో పాల్గొన్న విద్యార్థిని

తగరపువలస: హరేకృష్ణ మూవ్‌మెంట్ ఆధ్వర్యంలో శ్రీరాధా మదన్ మోహన్ మందిరంలో హెరిటేజ్ ఫెస్ట్‌లో భాగంగా చిన్నారులకు బుధవారం గాత్ర సంగీత పోటీలు నిర్వహించారు. ఆనందపురం మండలం గంభీరం ఐఐఎంవీ రోడ్డులోని హరేకృష్ణ వైకుంఠం వద్ద నిర్వహించిన ఈ పోటీలకు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన 23 పాఠశాలల నుంచి సుమారు 275 మంది బాలబాలికలు హాజరయ్యారు. ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 5 వరకు రెండు షిఫ్టులలో ఈ పోటీలు నిర్వహించారు. హెరిటేజ్ ఫెస్ట్‌లో భాగంగా ఇంకా నాటకాలు, శాస్త్రీయ నృత్యాలు, కుండలపై పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్ వర్క్ పోటీలు నిర్వహించనున్నట్లు హరేకృష్ణ వైకుంఠం ప్రతినిధి అంబరీష దాస తెలిపారు.

'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ' షెడ్యూల్‌లో మార్పులు

తగరపువలస: ఆనందపురం మండలంలో నిర్వహిస్తున్న 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమాల షెడ్యూల్ మారినట్టు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం తెలిపారు. ఈ నెల 10న చందక, 11న వేములవలస, 12న గంభీరం, 13న గిడిజాల, 14న గండిగుండం, 15న బోనిలో ప్రతి రోజూ సాయంత్రం 4 గంటలకు జరిగే కార్యక్రమాలకు భీమిలి సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు హాజరవుతారన్నారు. ఈ కార్యక్రమాలను ఆయా పంచాయతీల నాయకులు, ప్రజలు, కార్యకర్తలు జయప్రదం చేయాలని కోరారు.

ల్యాండ్ పూలింగ్‌కు రైతులు సహకరించాలి

పద్మనాభం: ల్యాండ్ పూలింగ్‌కు రైతులు సహకరించాలని తహసీల్దార్ కె.ఆనందరావు కోరారు. మండలంలోని కొవ్వాడలో చేపట్టనున్న ల్యాండ్ పూలింగ్‌పై గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. నందికొండ పరిసర ప్రాంతంలోని సర్వే నంబర్ 237లో ల్యాండ్ పూలింగ్ చేస్తామన్నారు. భూములు తీసుకున్న రైతులకు ప్లాట్లు ఇస్తామని చెప్పారు. భూములు తీసుకుంటే తాము జీవనోపాధి కోల్పోతామని పలువురు రైతులు తహసీల్దార్‌కు విన్నవించారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్యామల పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన నాయకుల మధ్య మాటల యుద్ధం

తగరపువలస: ఆనందపురం మండలం రామవరం, గంగసాని అగ్రహారంలో ల్యాండ్ పూలింగ్ రైతులకు యాజమాన్య హక్కుపత్రాల పంపిణీ సమయంలో టీడీపీ, జనసేన నాయకుల మాటల యుద్ధం జరిగింది. ఎల్పీవోసీల పంపిణీ అనంతరం గతంలో వైఎస్సార్‌సీపీ నుంచి టీడీపీలో చేరిన నాయకుడు తన ఇంటి వద్ద ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తదితర నాయకులకు, కార్యక్రమం జరిగిన చోట జనాలకు భోజనాలు ఏర్పాటు చేశారు. ఎమ్మెల్యే వెనుక వచ్చిన జనసేనలో ఇటీవల నామినేటెడ్ రాష్ట్ర డైరెక్టర్ పదవి పొందిన నాయకుడిని సదరు టీడీపీ నాయకుడు భోజనం చేయవలసిందిగా ఆహ్వానించాడు. దీంతో అందరి ముందు జనసేన నాయకుడు నీకు సంస్కారం తెలియదంటూ నోరు జారాడు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నాయకుడు రూ.లక్షలు ఖర్చు చేసి ఈ కార్యక్రమంలో పాల్గొన్న వారందరికీ భోజనాలు పెట్టానని కౌంటర్ వేశాడు. భోజనాల మర్మంతో టీడీపీ, జనసేన నాయకుల మధ్య మాటల యుద్ధానికి మరి కొందరు కార్యకర్తలు తోడయ్యారు. చివరకు జనసేన నాయకుడు భోజనం చేశాడా లేదా అన్న విషయం బయటకు పొక్కకుండా జాగ్రత్తలు పడ్డారు.

మధురవాడలో రహదారుల పరిశీలన

మధురవాడ: మధురవాడ హైవేతో పాటు మారికవలస జంక్షన్ నుంచి క్రికెట్ స్టేడియం మధ్య ట్రాఫిక్ పద్మవ్యూహాన్ని తలపిస్తోంది. ఈ నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రత్యామ్నాయ మార్గాల అన్వేషణపై జీవీఎంసీ, పోలీసు అధికారులు బుధవారం మధురవాడలో క్రికెట్ స్టేడియం నుంచి కొమ్మాది మధ్య గల రహదారులను పరిశీలించారు. అయితే, రోడ్డు వెడల్పు చేయడానికి సర్వీసు రోడ్డుకు ఇరువైపులా భారీ కాల్వలు ఉన్న కారణంగా సాధ్యం కాదని గుర్తించారు. గ్రీన్ బెల్ట్ వెడల్పు తగ్గింపు తదితర అంశాలను పరిశీలించారు. జోనల్ కమిషనర్ కె.కనక మహాలక్ష్మి, ఏసీపీ తిరుపతిరావు, సీఐలు సాయి, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలతో రోగ నిరోధకత



గర్భిణులకు పౌష్టికాహారం అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త నారాయణమ్మ

పద్మనాభం: శిశువుకు తల్లిపాలు పట్టడం వల్ల వారిలో రోగనిరోధక శక్తి వృద్ధి చెందుతుందని సర్పంచ్ బోదల పావని అన్నారు. మండలంలోని పెంట గ్రామంలో బుధవారం నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. తల్లి పాలు యొక్క ఆవశ్యకత గురించి వివరించారు. గర్భిణులకు పౌష్టికాహారం అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త జేవీ నారాయణమ్మ పాల్గొన్నారు.

ఏయూలో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సు ప్రారంభం



క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ప్రారంభిస్తున్న ఏయూ వీసీ రాజశేఖర్

మద్దిలపాలెం : బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాల్‌లో క్వాంటమ్ కంప్యూటింగ్ కోర్సును ఏయూ వీసీ ఆచార్య జి.పి.రాజశేఖర్ బుధవారం ప్రారంభించారు. అనంతరం కోర్సుకి సంబంధించిన సమగ్ర వివరాలతో కూడిన బ్రోచర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ కోర్సును అందిస్తున్న తొలి ప్రభుత్వ విశ్వవిద్యాలయంగా ఏయూ నిలుస్తుందని చెప్పారు. అదేవిధంగా నేషనల్ క్వాంటమ్ మిషన్‌ను జాతీయ స్థాయిలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిందని వివరించారు. దీనికి సంబంధించి ఏయూలో ప్రత్యేక ల్యాబ్, అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. అందుకోసం ప్రతిపాదనలు సిద్ధం చేసి దరఖాస్తు చేశామని చెప్పారు. ఈ రంగంలో ఆచార్యులను నిపుణులుగా తీర్చిదిద్దడానికి త్వరలో ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం నిర్వహించనున్నట్లు తెలిపారు.

పువ్వులు, పండ్ల ధరలకు రెక్కలు



వేములవలస మార్కెట్‌లో పువ్వుల విక్రయాలు

తగరపువలస: ఈ నెల 8న వరలక్ష్మీ వ్రతం నేపథ్యంలో పువ్వులు, పండ్ల ధరలకు రెక్కలు వచ్చాయి. ఆనందపురం మండలం వేములవలస మార్కెట్ బుధవారం వినియోగదారులు, పువ్వుల విక్రయదారులతో కిటకిటలాడింది. వేకువజామునే ప్రారంభమైన మార్కెట్‌లో పువ్వుల ధరలు ఆకాశాన్నంటాయి. 10 గంటల సమయంలో కాస్త దిగి వచ్చాయి. సాధారణ రోజుల్లో కిలో చామంతులు రూ.150 నుంచి రూ.300 ఉండగా బుధవారం రూ.400 నుంచి రూ.600కు విక్రయించారు. బంతి పువ్వులు కిలో రూ.160 నుంచి రూ.200 పలికాయి. కనకాంబరాలు సాధారణ రోజుల్లో కిలో రూ.300 నుంచి రూ.500 ఉండగా ఈ రోజు వేకువజామున రూ.2వేలకు అమ్ముడుపోయిన తరువాత రూ.1500కు దిగి వచ్చాయి. గులాబీలు వంద రూ.300కు, జాజులు కిలో రూ.1200కు, మల్లెలు రూ.1500 నుంచి రూ.2వేలకు, కాగడాలు రూ.1000 నుంచి రూ.1500 మధ్య అమ్ముడుపోయాయి. ఇక తామర, కలువ పువ్వులు ఒక్కొక్కటి రూ.10 నుంచి రూ.30కు విక్రయించారు. అమ్మవారి వ్రతంలో వినియోగించే అయిదు రకాల పండ్లను రెండేసి ఉంచి రూ.200 వంతున విక్రయించారు.

ఘనంగా గురువులకు వందనం వేడుకలు

మద్దిలపాలెం : విశాఖ ఆర్ట్ అండ్ డ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మద్దిలపాలెం కళాభారతి ఆడిటోరియంలో గురువులకు వందనం వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సోషల్ వర్కర్ ఉష పేరిట సీనియర్ కూచిపూడి నాట్యకళాకారిణి బి.వి జయ జ్యోతికి ఉష జీవిత సాఫల్య పురస్కారం అందించి సత్కరించారు. ఉత్తరాంధ్రకు చెందిన 22 మంది గురువులను ఘనంగా సత్కరించారు.

ఎట్టకేలకు కదిలిన రోడ్డు నిర్మాణ పనులు



రోడ్డుకు అడ్డంగా ఉన్న విద్యుత్ స్తంభాలు తొలగించి దూరంగా వేసిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఎట్టకేలకు ఆరుమాసాల నిరీక్షణ అనంతరం సంగివలస శివాలయం రోడ్డు నిర్మాణంపై జీవీఎంసీ అధికారులు చర్యలు చేపట్టారు. సుమారు రూ.కోటితో ఆధునికీకరించనున్న సంగివలస–పాండ్రంగి రహదారి నిర్మాణంలో తీవ్ర జాప్యం కారణంగా స్థానికులు తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. భారీ వాహనాల రాకపోకల కారణంగా ఇళ్లు, ఆలయాలపై బూడిద వెదజల్లబడటంతో పాటు పలువురు వ్యాధుల బారిన పడుతున్నారు. దీంతో 'రహదారి నిర్మాణంలో కాంట్రాక్టర్ గేమ్స్' శీర్షికతో మంగళవారం సాక్షిలో ప్రచురించిన కథనంపై టౌన్‌ప్లానింగ్ అధికారులు స్పందించారు. విద్యుత్ స్తంభాలు అడ్డుగా ఉన్నాయని కాంట్రాక్టర్ సాకుగా చూపడంతో మంగళ, బుధవారాలలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలను తొలగించారు. రెండు రోజుల్లో రహదారి నిర్మాణ పనులు ప్రారంభించనున్నట్లు చెప్పడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలి

- ఏఎస్‌ఐ సింహాచలం



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏఎస్‌ఐ సింహాచలం

మధురవాడ: విద్యార్థులు సోషల్ మీడియాకు దూరంగా ఉండాలని ఐటీ సెజ్ శక్తి టీం సభ్యులు, ఏఎస్‌ఐ సింహాచలం సూచించారు. ఓటీపీలు, వ్యక్తిగత సమాచారం, ఫొటోలు షేర్ చేయవద్దన్నారు. మధురవాడ ఢిల్లీ పబ్లిక్ స్కూల్లో విద్యార్థులకు గుడ్ టచ్, బ్యాడ్ టచ్, సోషల్ మీడియాతో జాగ్రత్తలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ శక్తి యాప్ ఇన్‌స్టాల్ చేసి అత్యవసర పరిస్థితుల్లో 112 లేదా 110, ఎస్‌వోఎస్‌ని వాడాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పూర్ణిమ, అసిస్టెంట్ ప్రిన్సిపాల్ రాధిక పాల్గొన్నారు.